

తగ్గిన గోదావరి వరద


ధవళేశ్వరం, ఆగస్టు 7 : గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బుధవారం రాత్రి 8గంటలకు నీటిమట్టం 7.50 అడుగులుగా నమోదు కాగా 4.50 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. గోదావరి సాధారణ స్థాయికి చేరినట్టు అధికారులు చెబుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల భద్రాచలం వద్ద నీటి మట్టం స్వల్పం గా పెరుగుతూ 35.30 అడుగులకు చేరుకుంది.

కురిసింది చిరుజల్లు..



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 : జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి చెదురుమొదురు గా వర్షం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా 39.6 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలి పింది. అత్యధికంగా రాజానగరంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా బిక్కవోలులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలో కోరుకొండలో 5.4 మి.మీ, రంగంపేట 5.0 మి.మీ, చాగల్లు 4.0, తాళ్ళపూడి 3.6 , రాజమహేంద్రవరం రూరల్ 2.6 , ఉండ్రాజవరం 2.6, నిడదవోలు 2.4, అనపర్తి 1.8, గోపాలపురం 1.6 , సీతానగరం 1.0, గోకవరంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 2.1 శాతం వర్షం పడింది.

కొండ జారిన బండరాయి..



గోకవరం, ఆగస్టు 7 : తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం(కొండ) పైనుంచి బుధవారం పెద్ద రాయి కిందకు జారి పడింది. కొండకు సమీపంలో నివసిస్తున్న గృహల మధ్యకు రాయి జారుకుంటూ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రాయి కాస్త గట్టిగా జారి ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించేది. పెద్ద ఎత్తున ప్రాణాలు పోయేవి. అదృష్టవశాత్తు ఏ ఒక్కరికీ ప్రమాదం సంభవించలేదు. దీంతో ఆ దేవుడే తమను కాపాడాడని కొండ పరిసర ప్రాంత వాసులు చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండపై మట్టి కరిగి రాయి జారి పడిఉంటుందని భావిస్తున్నారు.రాయి జారి పడిన ప్రాంతాన్ని టీడీపీ నాయకుడు బదిరెడ్డి బాబీవీఆర్వో లచ్చిరెడ్డి పరిశీలించారు.

రావిచెట్టు కొట్టారని కేసు..



కొవ్వూరు, ఆగస్టు 7 :కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అనుమతుల్లేకుండా దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలే తీసుకుంటామని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు.బుధవారం కొవ్వూరు మండ లం కుమారదేవం విచ్చేసిన కలెక్టర్ ప్రశాంతి దృష్టికి దేవతావృక్షం నరికివేసిన ఉదంతాన్ని తీసుకెళ్లారు.దీనిపై స్పం దించిన ఆమె విచారించాలని సబ్‌కలెక్టర్‌కు సూచించడంతో రావిచెట్టును పరిశీలించారు.దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తు లపై వాల్టా చట్ట ప్రకారం కేసు నమోదు చేయించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబును ఆదేశించారు.ఈ మేరకు వీఆర్వో సైదారాణి పోలీసులకు ఫిర్యాదుచేశారు. నరికివేసిన చెట్టుకొమ్మలు చిగురించే లా కెమికల్ ట్రీట్‌మెంటు ద్వారా చర్యలు తీసుకుంటామని రాజమండ్రి రోటరీక్లబ్ ప్రతినిధి తీగెల రాజా తెలిపారు.

2027 గోదావరి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: 2027లో రాబోయే గోదావరి పుష్కరాలకు ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ నరసింహకిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్, పలు శాఖల అధికారులతో సమీక్షించారు. 2027 పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని ఇప్పటి నుంచే ఏర్పాట్లు కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నిర్వహించాలన్నారు.పుష్కర ఘాట్లకు వచ్చే సాధారణ భక్తులకు ,వీఐపీలకు ఘాట్‌లకు వచ్చే ట్రాఫిక్ నియంత్రించే విధంగా వేర్వేరు మార్గాలను కేటాయించాలన్నారు. ఘాట్స్‌కు వెళ్లే మార్గాలకు సంబంధించి రోడ్ రూట్ మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు కార్యాచరణతో సిద్ధం చేసుకోవాలన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా భక్తులను రేవుల నుంచి బయటకు పంపించే విధంగా రూట్ మ్యాప్‌ను రూపొందించాలన్నారు.సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, నగరపాకల సంస్థ ఎస్ఈ జి.పాండురంగారావు, ఆర్ అండ్‌బీ ఈఈ ఎస్‌వీబీ.రెడ్డి, డీపీవో ఎం రాంబాబు, ఆర్టీసీ డీపీటీవో ఎం.షర్మిళ అశోక్, డీటీవో కేఎస్ఎంవి కృష్ణారావు, ఆర్డీవో ఎఫ్ఏసీ కేఎల్ శివజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై సీఎంకు బత్తుల విన్నపం

సీతానగరం,ఆగస్టు 7 : సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో పురుషోత్తపట్నం,చినకొండేపూడి,నాగంపల్లి గ్రామాల్లో 75 ఎకరాలకు 92 మందికి నష్టపరిహారం అందలేదని శాసన సభలో సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీగా రమేశ్ బాబు



రాజమహేంద్రవరం,ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ డీఎస్పీగా కె.రమేశ్ బాబు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నరసింహ కిశోర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.1989 బ్యాచ్‌కి చెందిన రమేశ్ మచిలీ పట్నం జిల్లా శిక్షణ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు.గతంలో 2016 నుంచి 2018 వరకూ ఈస్ట్ జోన్ డీఎస్పీగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని శాంతి భద్రతలపై ఇప్పటికే తనకు అనుభవం ఉందన్నారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పని చేసిన విజయపాల్ వీఆర్‌కి వెళ్లిన విషయం తెలిసిందే.

బోధనా స్కిల్స్‌పై ఐదు రోజులు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 7 : డిగ్రీ కళాశాలల అధ్యాపకులు బోధనా స్కిల్స్ పెంచుకోవాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రాజమండ్రి నోడల్ రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు డిగ్రీ కళాశాల అధ్యాపకులకు బోధనా స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పోలా భాస్కర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మనసును, శరీరాన్ని సమన్వయం చేసుకోగలగడం, భావ ప్రజ్ఞను కలిగి ఉండడం వంటి నైపుణ్యాలపై శిక్షణ అత్యంత అవసరమన్నారు. నోడల్ రిసోర్సు సెంటర్ సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్,అధ్యాపకులు, కీ రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

మా బదిలీ..ఎప్పుడో!



కానిస్టేబుళ్ల ఎదురుచూపులు

- రెండేళ్లుగా నిలిచిన బదిలీలు
- 150 మంది అర్జీలు
- 120 మందితో జాబితా సిద్ధం
- డీజీ ఆదేశాలతో బ్రేక్
- ఎంతో మంది ఐదేళ్లుగా ఒకేచోట
- అయినా నేటికీ బదిలీల్లేవ్
- పిల్లల స్కూల్స్‌పై ఆందోళన
- ఇప్పటికీ పట్టని వైనం
- ఇకనైనా తేల్చాలని పట్టు
- సజావుగా అధికారుల బదిలీ
- ఎస్పీ స్పందించాలని డిమాండ్

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కానిస్టేబుల్స్ బదిలీల్లో తీవ్ర జాప్యం జరుగు తోంది. వాస్తవానికి ఎస్పీ కంటే ముందుగానే వారి బదిలీల జాబితా సిద్ధమైంది. ఎస్పీ జగదీశ్, ఐదుగురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు బదిలీ అయ్యారు. కానీ సుమారు రెండు నెలల కిందట నుంచీ ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్ల బదిలీ మాత్రం డీజీ ఆదేశాలతో ఎస్పీ సంతకం దగ్గర ఆగిపోయాయి. వాస్తవానికి పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా ప్రతి ఏడాదీ స్కూల్స్ తెరిచే నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేయ డం రివాజు.కానీ ఎన్నికల తర్వాత ఆ మాటే మరిచారు. దీంతో కానిస్టేబుళ్ల కుటుంబాలు పిల్లల స్కూల్స్ విషయంలో ఆందోళన చెందుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అయోమయం..

ఎక్కడికి బదిలీ చేస్తారో తెలియక కానిస్టేబుళ్లు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్‌స్పెక్టర్ నుంచి పైస్థాయి వరకూ అర్థబలంతో మేనేజ్ చేసుకొనే పరిస్థితి ఉంటుంది.కానీ హోంగార్డు నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ ఆర్థికంగా సతమతమవు తూనే ఉంటారు. పోస్టింగ్‌లకు పైసలు చెల్లించుకొనే పరిస్థితి ఉండదు.ఈ నేపథ్యంలో జిల్లాలోని కొందరు కానిస్టేబుళ్లు బదిలీలకు ఎదురు చూస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకూ బదిలీ చేసే అధికారం ఎస్పీ చేతిలో ఉంటుంది.ఐదేళ్లు దాటి బాగా ఎక్కువ కాలం ఒకే సీటులో తిష్ట వేసిన కానిస్టేబుళ్లు కొందరికి సుమారు రెండేళ్ల కిందట ఎస్పీగా సుధీర్ కుమార్ రెడ్డి స్థాన చలనం కలిగించారు.తర్వాత గతేడాది సెప్టెంబరులో ఎస్పీగా జగదీశ్ వచ్చారు.విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నా కొందరి అభ్యర్థనలు పరిగణన లోకి తీసుకుని బదిలీచేశారు.తర్వాత ఎన్నికలు రావడంతో డీవోలు ఆగిపోయాయి.ఐదేళ్లు మించి ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న వాళ్ల బదిలీలపై చర్యలు తీసుకోలేదు.దీంతో చాలామంది ఆరో ఏట అడుగు పెట్టేశారు.

నేటికీ కానరాని స్పష్టత..

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత బదిలీల క్రతువు మొదలైంది. జిల్లాలో ఉన్నతాధికారుల దగ్గర నుంచి ఎస్ఐ వరకూ స్థాన చలనం కలుగుతోంది. కానీ జాబితా సిద్ధమైనా ఇప్పటికీ కానిస్టేబుళ్ల విషయంలో ఒక నిర్ణయం వెలువడలేదు.ఎన్నికల తర్వాత బదిలీలకు కొందరు అర్జీలు పెట్టుకున్నారు. కానీ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటినా డీవోలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.రిక్వెస్టులు పెట్టుకున్న పోలీసులు బదిలీల ఆదేశాల (డీవో)కు ఎదురుచూస్తున్నారు. నరసింహ కిశోర్ ఎస్పీగా గత నెల 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇప్పటి వరకూ కానిస్టేబుళ్ల డీవోలపై ఎలాంటి చొరవా చూపలేదు. పోలీసులను ఎవరినీ బదిలీ చేయవద్దని కొత్త (కూటమి) ప్రభుత్వంలో డీజీగా ద్వారకాతిరుమలరావు బాధ్యతలు స్వీకరించగానే ఆదేశాలిచ్చారు.అయితే తర్వాత చాలా మంది అధికారుల బదిలీలు జరిగాయి.దీంతో కానిస్టేబుళ్ల విషయంలోనే ఆ ఆదేశాలు అమలు చేస్తున్నారా? లేదా? అనే అయోమయం ఉంది.ప్రతి ఏడాదీ బదిలీలు చేయాల్సి ఉన్నా రెండేళ్ల నుంచీ క్రమం తప్పింది. తర్వాత ఎన్నికల వల్ల సాధ్యపడలేదు.బదిలీలు ఉంటే త్వరగా ఆదేశాలు ఇవ్వాలని, లేకపోతే స్పష్టంగా చెప్పాలని డిపార్ట్‌మెంట్‌లో చర్చ సాగుతోంది.ఇలా తాత్సారం చేసి విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేస్తే ఇబ్బందులు తప్పవని అంటున్నారు.సిద్ధంగా ఉన్న డీవోల వరకైనా తేల్చాలని అభ్యర్థిస్తున్నారు.

120 మందితో జాబితా రెడీ..

జిల్లాలోని బదిలీలకు సుమారు 150 మంది కానిస్టేబుళ్లు అర్జీలు పెట్టుకున్నారు.తగు వడపోత తర్వాత గత ఎస్పీ జగదీశ్ 120 మంది బదిలీలకు ఆదేశాలు సిద్ధం చేశారు.కానీ చివరి నిమిషంలో డీజీ ఆదేశాలతో బదిలీలు ఆగిపోయాయి. తర్వాత వాటిని పట్టించుకోవడం మానేశారు. చిన్నస్థాయి ఉద్యోగులు కావడంతో ఉన్నతాధికారులను అడిగితే ఎటు తిరిగి ఎటు వస్తుందో అనే భయంతో ఎవరూ సాహసం చేయ డం లేదు. ముఖ్యంగా పిల్లలను స్కూల్‌లో చేర్చే విష యంలో తర్జనభర్జన పడుతున్నారు. భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పని చేసే వాళ్లు, పెద్దవాళ్లకు ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. డీవోలు తాము కోరుకున్నట్టు వస్తే సమస్య తీరుతుందని ఆశ పడుతున్నారు.అర్జీలు పెట్టుకున్న వాళ్లే కాకుండా ఐదేళ్లకు మించి ఒకేచోట పాతుకుపోయిన వాళ్లపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం కనిపి స్తోంది. ఒక చోట డీవో ఉన్నా తాము కోరుకున్న చోట ఏళ్ల తరబడి పాతుకుపోయి వాళ్లు ఉన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.



చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

చేనేత వస్త్రాలు ఆన్‌లైన్‌లో విక్రయించాలి

జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

అనపర్తి, ఆగస్టు 7 : మార్కెట్లో వినియోగదారులను ఆకర్షించే విధంగా చేనేత ఉత్పత్తులు రూపొందించి.. ఆన్‌లైన్‌లో విక్రయాలపై నేత కార్మికులు దృష్టి సారించాల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం అనపర్తి మండలం పులగుర్తలో చేనేత పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్ఎంఎస్ఎస్, ముద్ర లోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులను ఆకర్షించే విధంగా నూతన డిజైన్లతో వస్త్రాలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేనేత సొసైటీలు ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పులగుర్త, పందలపాక, పసలపూడి, ఎస్టీ రాజాపురం, పెదపూడి సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నేత కార్మికులను కలెక్టర్ ప్రశాంతితో కలిసి సత్కరించారు.కార్యక్రమంలో పులగుర్త సొసైటీ కార్యదర్శి దంతంశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకలెక్టర్‌లను సత్కరించారు.ఈ కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.ధనుంజయరావు, అలోక్ రంజన్, బి.కృష్ణ భాస్కర్, బి.తవిటినాయుడు, కె.గంగరాజు, డి.వీరవెంకట సత్యనారాయణ, పేరిశెట్టి లాలయ్య, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ



గోకవరంలో పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

గోకవరం, ఆగస్టు7: జిల్లాలో గంజాయి, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. గోకవరం పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ విధి విధానాలు, శాంతి భద్రతలు,సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ అవుట్ పోలీస్ స్టేషన్ పరిశీలించారు.మండలంలో మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాలపై దృష్టి సారించాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు.ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగమురళి, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.



నీట మునిగిన ఊరు : శ్రీరంగపట్నంలో రోడ్డుపై నీరు

ముంచేసిన బురద కాలువ

శ్రీరంగపట్నం వద్ద కాలువకు గండి

- రోడ్డుపై పారుతున్న వరద నీరు
- నీట మునిగిన వేలాది ఎకరాలు
- 10 గ్రామాలకు రాకపోకలు బంద్



నిండుగా : ఉధృతంగా బురద కాలువ

కోరుకొండ,ఆగస్టు 7 : బురద కాలువకు గండి పడింది.. పంట చేలను ముంచెత్తింది. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం అచ్యుతాపురం గ్రామాల సరిహద్దుల పంట పొలాల వద్ద బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ఎక్కువై బురద కాలువకు గండిపడింది. ఈ వరద నీరు శ్రీరంగపట్నం గ్రామాన్ని ముంచేసింది. వేలాది ఎకరాలు నీటి ముంపులో ఉండిపోయాయి. శ్రీరంగపట్నం గ్రామ రోడ్లపై బురద కాల్వ ఉధృ తంగా ప్రవహిస్తుండడంతో గ్రామస్థులు భయపడుతున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి నెల్లిపూడి వాగులోకి వరద చేరుతోంది. ఆ వరద నీరు సూరంపాలెం రిజర్వాయర్ గేట్లు ఎత్తి బురద కాలువ విడుదల చేస్తున్నారు. ఆ కాలువ ద్వారా కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో 22 కిలోమీటర్ల మేర ప్రవహించి గోదావరి నదిలో కలవాల్సి ఉంది. బురద కాలువ ఆక్రమణకు గురికావడం, గట్లు బలహీనం కావడం, కాలువకు అడ్డంగా అనధికార చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయ డం తదితర కారణాలతో గండి పడింది. దీంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీరంగపట్నం మీదుగా కోరుకొండకు వచ్చే కోటికేశవరం, కోటి, రాఘవాపురం, బొల్లేద్దుపాలెం, గరగలంపాలెం, అచ్చియ్యపాలెం, నాగంపల్లి, నల్గొండ, చీపురుపల్లి, తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. నెల రోజుల్లో బురద కాలువ వరద నీరు శ్రీరంగపట్నంను నాల్గోసారి తాకింది.



ముంచినది : శ్రీరంగపట్నంలో నీట మునిగిన పంట చేలు

50 ఏళ్లుగా తీరని సమస్య

కోరుకొండ మండలంలో శ్రీరంగపట్నం గ్రామంలో గత 50 ఏళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.14 వేల జనాభా ఉన్నా పాలకులు బురద కాలవ ముంపునకు శాశ్వత పరిష్కారంచూపించకపోవడంతో ప్రతి ఏడాది ఇంతే.ఈ కాలువ వరద వల్ల ప్రతి సంవత్సరం శ్రీరంగపట్నం, మునగాల, కోటి, బుచ్చింపేట, బూరుగుపూడి,గుమ్ములూరు, కాపవరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో కోట్లాది రూపాయల విలువైన పంటలకు నష్టం వాటిల్లుతుంది. బురద కాలువ వరద నుంచి తమను రక్షించమని ప్రజలు వేడు కుంటూనే ఉన్నారు.వరదలు వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనం తప్ప ఈ నాటి వరకు శాశ్వత పరిష్కారం చూపించలేదు. కాలువ తాకిడికి కోరుకొండ, సీతానగరం, గోకవరం, మండల పరిధిలోని అనేక ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రోడ్లు దెబ్బతింటున్నాయి.అధికారులు రంగంలోకి దిగి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యాయం కావాలని అత్తింటి ఎదుట **వివాహిత దీక్ష** 7


కంప్యూటర్ ఆపరేటర్‌ను కాటువేసి పాము

కంప్యూటర్ కీబోర్డు కింద పాము

తీస్తుండగా కాటేసిన వైనం

మండపేట, ఆగస్టు 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ చల్లా ఆదిసూర్యనారాయణమూర్తిని బుధవారం పాము కాటేసింది. ఉదయం కార్యాలయానికి వచ్చిన మూర్తి కంప్యూటర్ ఆన్ చేసేందుకు కీబోర్డు తీస్తుండగా దాని కిందే వున్న జెర్రిగొడ్డు అతడి చిటికెను వేలిపై కాటేసింది. వెంటనే అతడు కేకలు వేయడంతో సహచర సిబ్బంది వచ్చి పామును చంపేశారు. ఆ పాము ఐదు అడుగులు పైగా పొడవు ఉంది. మూర్తిని పంచాయతీ సిబ్బంది మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. మూర్తిని సర్పంచ్ బూరిగ అశీర్వాదం, కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, సహచర కంప్యూటర్ ఆపరేటర్లు చిట్టి, రవి పరామర్శించారు.


వీఆర్ పురం మండలం అన్నవరం చప్టాపై నుంచి కూలీలను దాటిస్తున్న స్థానికులు

పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

వరరామచంద్రాపురం, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. అన్నవరం చప్టాపై ఉదయం 8 గంటల నుంచే వర్షపు నీరు ప్రవహించడం మొదలైంది. చప్టాకు రెండువైపులా పర్లాంగు దూరం వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పనులకు వెళ్లే కూలీలు, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడ్డారు. మొద్దులగూడెం, సీతంపేట మధ్యలో ఉన్న చెరువు అలుగు పైనుంచి వర్షపు నీరు భారీగా ప్రవహించడంతో దాదాపు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి అన్నవరం చప్టా దగ్గర ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చింతూరు: డివిజను పరిధిలోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వరి నాట్లతో పాటు ఇతరత్రా వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ప్రధాన రహదారిపై సోకిలేరు, అత్తాకోడలు వాగు, అన్నవరం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం చింతూరులో వారపు సంతకు నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల కోసం వచ్చిన వారంతా వాగులు దాటి ఇళ్లకు చేరుకున్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌బాబు

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం

అన్నవరం, ఆగస్టు 7: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన సత్యదేవుడిని దర్శించుకున్నారు. దేవస్థానం ఉద్యోగులు రమేష్‌బాబుని కలిసి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి బంగారు తాపడం అమరిక పనులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ ధ్వజస్తంభానికి నెల్లూరుకు చెందిన ఒక దాత సుమారు రూ.3కోట్ల వ్యయంతో రాగి రేకుపై బంగారు తాపడం చేయించిన సంగతి విదితమే. నూతన ధ్వజస్తంభాన్ని ఏప్రిల్ నెలలో ప్రతిష్ఠాపన చేయగా బంగారు తాపడం చేయించే ప్రక్రియ పూర్తయ్యింది. గురువారం ఉదయం దాత కొబ్బరికాయ పొట్టి బంగారు తాపడం అమరిక పనులను ప్రారంభిస్తారు.

ఏసీబీ డీఎస్పీగా కిషోర్‌కుమార్



రాజమహేంద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్‌లోని డీఎస్పీ-2గా ఎం.కిషోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఈ రేంజ్ పరిధిలోకి వస్తాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఈస్ట్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఆయన ఏసీబీకి వెళ్లారు.

వరద నీటిలో పడిపోయిన వ్యక్తి

రక్షించిన స్థానికులు



గొల్లప్రోలు, ఆగస్టు 7: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు లోని సూరంపేట చుట్టూ వరద నీరు చేరింది. ఆ ప్రాంతానికి చెందిన కోన సూర్యనారాయణ వరద నీటిని దాటుకుంటూ సూరంపేట వెళ్తుండగా మార్గమధ్యంలో వరద నీటిలో పడిపోయాడు. అతడిని గమనించిన స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఎవరూ గమనించకుంటే తాను ప్రాణాలు కోల్పోయే వాడినని సూర్యనారాయణ చెప్పాడు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి


మృతుడు శివశంకర్

రాజానగరం, ఆగస్టు 7: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గామన్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన ఈడే శివశంకర్ (39) ఐషర్ వ్యానులో విశాఖపట్నం నుంచి విజయవాడ బయల్దేరాడు. మార్గమధ్యంలో గామన్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి టైరు పంక్చర్ కావడంతో వ్యాన్ పక్కకు పెట్టి టైరు మార్చుకుంటున్నాడు. ఆ సమయంలో అదే మార్గంలో విశాఖ నుంచి బాపట్లలోని ఎయిర్‌ఫోర్స్ క్యాంటీన్‌కు కిరాణా వస్తువుల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి శివశంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ షేక్ బడే స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎస్ఐ మనోహర్ సంఘటనాస్థలానికి చేరుకున్నాడు. శివశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


నామవరంలో నిశ్చితార్థం రోజున ఫొటో (పాత చిత్రం)

కి 'లేడీ'లు

» డబ్బు కోసం ఘరానా మోసం » ఆరుగురు మహిళలపై చీటింగ్ కేసు


వధువుగా నటించిన నీరజ (పాత చిత్రం)

కాకినాడ క్రైం, ఆగస్టు 7: కష్టపడకుండా సులువుగా డబ్బు సంపాదించాలన్న దుర్బుద్ధితో ఏకంగా పెళ్లినే అపహాస్యం చేసిన ఆరుగురు మహిళలపై కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి... కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద మార్కెట్ వీధికి చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ అవివాహితుడు. కాగా అతడి తరపు బంధువులు సంబంధాన్ని కుదిర్చేందుకు శిరీష అనే మధ్యవర్తిని కలిశారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 23న శిరీష అతనికి వధువు తరపున సత్యవేణి, దుర్గ అనే ఇద్దరిని పరిచయం చేసింది. అనంతరం కృష్ణమోహన్‌ను అదేరోజు రాజమహేంద్రవరంలోని నామవరం శాటిలైట్ సిటీకి తీసుకెళ్లి వధువుగా నీరజ అనే యువతిని చూపించారు. వధువు తల్లిగా సత్యదేవి, మేనత్తగా ప్రియాదేవిలను పరిచయం చేశారు. వధువు నచ్చడంతో నిశ్చితార్థం తంతు వెంటనే చేసుకోవాలని నిర్ణయించి వధువుకు ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల నగదు, ఒక ఆండ్రాయిడ్ సెల్‌ఫోను, ఒక బంగారు గొలుసు... మొత్తంగా రూ.5లక్షలు విలువైన సొత్తును వధువు తరఫున వచ్చిన సత్యదేవి, ప్రియాదేవిలకు కృష్ణమోహన్ అందజేశాడు. కొంతకాలం తర్వాత అతడికి అనుమానం వచ్చి వాకబు చేయగా అప్పటికే నీరజకు పెళ్లి అయి సంతానం ఉందని, మధ్యలో వచ్చిన మహిళలు అందరూ మోసానికి పాల్పడ్డవారేనని కృష్ణమోహన్ గుర్తించాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురు మహిళలపై వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 అన్న క్యాంటీన్లు ప్రారంభోత్సవానికి సిద్ధం

» రెండో విడతలో మరో మూడు క్యాంటీన్లు » పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్


గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న సుధాకర్

గొల్లప్రోలు, ఆగస్టు 7: ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 33 అన్న క్యాంటీన్ భవనాలు ఈ నెల 15న ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్ వెల్లడించారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. భవనంపై నీరు నిలిచిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్లాబు నీరు కారడాన్ని, వైర్లు వేలాడుతూ ఉండటాన్ని గమనించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ గొల్లప్రోలు పట్టణంతో పాటు అమలాపురం, జంగారెడ్డిగూడెంల్లో క్యాంటీన్లను రెండో విడతలో ప్రారంభిస్తామన్నారు. పలు పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టుల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి శుద్ధి చేసిన నీటిని గొల్లప్రోలుకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తిగా నిలిచిన అర్బన్‌హెల్త్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ హుస్సేన్‌ను ఆదేశించారు.


పడిపోయిన సినిమా చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సినిమా చెట్టును బతికించే ప్రయత్నం చేస్తాం

రోటరీ క్లబ్ సహకారం తీసుకుంటాం... కుమారదేవంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఆగస్టు 7: సినిమా చెట్టు చిగురించేలా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున నేలకొరిగిన సినిమా చెట్టును బుధవారం ఆమె జిల్లా ఫారెస్టు అధికారులు, రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి పరిశీలించారు. 150 సంవత్సరాల వయసున్న నిద్రగన్నేరు చెట్టు దెబ్బతిని రెండుగా చీలి నేలకొరిగింది. రోటరీ క్లబ్ సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పడిపోయిన చెట్టును బతికించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లా టూరిజం కౌన్సిల్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఎఫ్‌వో బి.నాగరాజు మాట్లాడుతూ నేలకొరిగిన చెట్టు ఏపుగా, గుబురుగా పెరిగే వృక్షమన్నారు. ఎండిపోయిన బలహీనమైన కొమ్మలను తొలగించకపోతే కాలక్రమేణా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, గ్రామస్థుల మనోభావాలను కాపాడుతూ అదే చెట్టును సాంకేతికంగా బతికించుకోవడానికి ప్రవాసాంధ్రులు సైతం ముందుకు వస్తున్నారన్నారు. గతంలో 150 సంవత్సరాల చెట్టును ట్రాన్స్‌ప్లాంట్ చేయడాన్ని తాను కూడా చూశానన్నారు. అదే పద్ధతిలో ఈ చెట్టునూ బతికించే అవకాశం ఉందన్నారు. అటవీ శాఖ తరపున సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అజయ్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గన్నమని రాజు, గ్రామస్తులు ఉన్నారు.



కళావాహన అనంతరం భీమేశ్వర స్వామి మూలవిరాట్, హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే

ద్రాక్షారామలో శాస్త్రోక్తంగా కళావాహన...పూజల్లో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు.. భక్తులకు దర్శనాలు ప్రారంభం

ద్రాక్షారామ, ఆగస్టు 7: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను బుధవారం ఉదయం 11.05 గంటల నుంచి అనుమతించారు. మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి గర్భాలయాలను ఏప్రిల్ 24న మూసివేసి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు. మూడు నెలల ఏడు రోజుల అనంతరం భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్‌ల దర్శనం పునః ప్రారంభించారు.

భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి కళావాహనను బుధవారం వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, పునః పూజలు, ఋగ్వేద పారాయణ, గర్భాలయ పూజలు, పరివార దేవతార్చన, కుంభాలు, గో దర్శనం, శాంతి హోమం, పూర్ణాహుతిల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు, ఆయన తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం దంపతులు పాల్గొన్నారు. ఉదయం 9.34 గంటలకు కళావాహన ప్రారంభించి అనంతరం స్వామివారికి జలాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

భీమేశ్వర స్వామి మూలవిరాట్ సంరక్షణ దృష్ట్యా కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు జలాలతోనే అభిషేకం నిర్వహిస్తామని మంత్రి సుభాష్ ప్రకటించారు. ఆలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం దేవస్థానం ఆధ్వర్యంలో తొలి అభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం జలాలతో భీమేశ్వరునికి అభిషేకం జరుపుతారన్నారు. మాణిక్యాంబ అమ్మవారికి పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు. పునః ప్రారంభోత్సవంలో పాల్గొనే అవకాశం రావడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, చింతపల్లి అర్జున్, గుబ్బల యేసురాజు, జాన్సి విజయలక్ష్మి, గజలక్ష్మి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ ఈవో పీటీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సింగన్నగూడెంలో మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణ కమిటీ సభ్యులు

చిన్నారుల మృతిపై విచారణ

చింతూరు, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో పది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందంతో జిల్లా యంత్రాంగం కదిలింది. రెండు రోజుల్లో జరిగిన ఘటనలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ సాధన, చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, చింతూరు సీహెచ్‌సీ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్షతో కూడిన ఒక కమిటీని నియమించారు. వీరంతా బుధవారం సింగన్నగూడెం, గంగన్నమెట్ట, బొడ్డుగూడెం గ్రామాల్లోని బాధిత కుటుంబాలను నేరుగా కలిసారు. చిన్నారుల తల్లిదండ్రులతో జరిగిన ఘటనలపై ఆరా తీశాక వాగులు ఉధృతిగా వున్న కారణంగా చదలవాడ, వంకగూడెం గ్రామాలకు వెళ్లలేదని వారు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు.

శ్వాసకోస ఇబ్బందితో మరో బాలుడు ఆసుపత్రిపాలు



చింతూరు, ఆగస్టు 7: సరిహద్దు రాష్ట్రమైన ఒడిసాలోని మల్కన్‌గిరి జిల్లా చిన్నమదుగూరుకు చెందిన పవన్ శ్వాస పీల్చుకోడంలో ఇబ్బందిపడుతున్నాడు. దీంతో అతడి తల్లిదండ్రులు కొవ్వాసి దూలయ్య-రాజమ్మ గ్రామంలోని ఓ నాటు వైద్యుడిని మంగళవారం ఆశ్రయించారు. అతడు ఇచ్చిన చెట్టు మందుని కుమారుడికి పట్టించారు. బుధవారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో చింతూరు సీహెచ్‌సీకి తీసుకురాగా సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో పవన్‌కి ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: న్యాయం చేయాలని ఒక వివాహిత తన కుమారుడితో కలిసి సుమారు రెండు గంటల పాటు వర్షంతో అత్తింటి ఎదుట వద్ద బుధవారం దీక్షకు దిగింది. దీంతో ఆమె భర్త, అత్తమామలు ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. బాధితురాలి కథనం ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన రేష్మాకు రాజేంద్రనగర్ వడ్డీల వీధికి చెందిన హబీద్ బాషాతో 2012


దీక్ష చేస్తున్న రేష్మాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ చిట్టిబాబు



న్యాయ పోరాటం

» అత్తింటి ఎదుట కుమారుడితో కలిసి వివాహిత దీక్ష

» అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

అక్టోబరు 21న వివాహం జరిగింది. పెళ్లయిన పది రోజులకే అదనపు కట్నం కోసం వేధింపులు ఆరంభమయ్యాయి. 2013లో బాబు పుట్టాడు. ఆ తర్వాత ఇల్లు కట్టుకుందామని చెప్పి బంగారు మొత్తం తీసుకుని పుట్టింటి వద్ద వదిలేశాడు. ఎన్నిసార్లు ఇంటికి వచ్చినా బయటకు గెంటేసేవాడు. దీంతో 2016లో బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోర్టులో కేసు వేయగా 2023లో అనుకూలంగా తీర్పు వచ్చింది. రేష్మాతో పాటు కుమారుడుని భర్త చూసుకోవాలని, నెలకు రూ.16 వేలు ఇచ్చి ఇంట్లో పెట్టుకోవాలని లేదా ఇల్లు అద్దెకు తీసిపెట్టాలని కోర్టు చెప్పినా హబీబ్ పట్టించుకోలేదు. 'నా తండ్రి కువైట్‌లో పనిచేస్తూ 2021లో కొవిడ్‌తో మరణించాడు. నాకు ఏ దిక్కూ లేదు. కుమారుడిని పెంచడం చాలా కష్టంగా ఉంది. నా భర్తకు వేరే పెళ్లి చేయడానికి తండ్రి, తల్లి, ఆడపడుచు ప్రయత్నాలు చేస్తున్నార'ని రేష్మా చెప్పింది. అమ్మాయిలతో గోవాలో తిరుగుతున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఫొటోలను మీడియాకు అందజేసింది. తనను ఏలుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే దారి కనిపించట్లేదని కన్నీరు పెట్టుకుంది. స్థానిక మహిళలు ఆమెకు అండగా నిలిచారు. బాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించారు. మాజీ కార్పొరేటర్ నక్కా చిట్టిబాబును పంపి బాధితురాలితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. న్యాయం చేస్తామని, దీక్ష విరమించాలని సూచించారు. న్యాయం జరిగే వరకు అత్తింటి వరండాలోనే తాను ఉంటానని రేష్మా చెప్పింది. దీంతో భర్త, అత్తమామలను ఇంటికే పిలిపించి సమస్యను ఎమ్మెల్యే వద్ద పెట్టి న్యాయం చేస్తామని చిట్టిబాబు చెప్పారు.

మానసిక రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతలు కలిగిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు సూచించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. మానసిక రోగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఉమ్మడి తూర్పుగోదావరి వైద్యాధికారులు, దివ్యాంగుల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

మతిస్థిమితం లేని కుటుంబానికి ఆసరా

వైద్యం కోసం రూ.లక్ష అందించిన మోతుగూడెం గ్రామస్తులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న మోతుగూడెం గ్రామస్తులు



రాజు

మోతుగూడెం, ఆగస్టు 7: మోతుగూడేనికి చెందిన లోతాని లక్ష్మయ్య 20 సంవత్సరాలుగా హమాలీ పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో ఆనందంగా ఉండేవాడు. కాలగమనంలో అతడు చనిపోగా భార్య దాలమ్మ ఇంటి పనులు చేసుకుంటూ 15 సంవత్సరాలుగా బతుకు ఈడ్చుకుంటూ వచ్చింది. అమ్మకు తోడుగా కొడుకు రాజు విజయవాడలో ఒక ప్రముఖుని వద్ద పని చేశాడు. అతడిని ఎవరో ఎం దుకో తలపై బలంగా కొట్టడంతో మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో ఏమీ చేయలేని స్థితిలో ఏ పనికీ వెళ్లలేక తల్లి కూడా మతి స్థిమితం కోల్పోయింది. వీరిని చూసి చలించిన గ్రామస్తులు విశాఖలోని ఆసు పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని భావించారు. వైద్య ఖర్చుల కోసం మోతుగూడెం ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్స్, సిబ్బంది రూ.10వేలు, మోతుగూడెం యాదవుల యాత్, గ్రామస్తులు, జెన్‌కో ఉద్యోగస్తులు కలిసి సుమారు లక్ష రూపాయలు పోగు చేసి గ్రామ పెద్దల ద్వారా వారి బంధువులకు అందజేశారు. విశాఖలో ట్రీట్మెంట్ చేయించి సొంతూరు శ్రీకాకుళం తీసుకెళ్తామని దాలమ్మ బంధువు లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాసి రమణ, ఇప్పిలి డిల్లేశ్వరరావు, కృష్ణ, కొట్టు శ్రీనివాసరావు, మట్టపర్తి రమణ, నాగు, సాయి, చిన్నారావు, నాయులు పాల్గొన్నారు.

శిశు మరణాలకు అడ్డుకట్ట

- చింతూరు డివిజన్ వ్యాప్తంగా ఇంటింటా సర్వే
- 139 మంది సిబ్బందితో క్షేత్ర స్థాయి పరిశీలన
- 15 మంది వైద్యులతో వైద్య శిబిరాలు
- ఐటీడీఏలో హెల్త్ సెల్ ఏర్పాటు
- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



చింతూరు, ఆగస్టు 7: శిశు మరణాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎటపాక మండలాల్లో సున్న నుంచి ఏడాదిలోపు వయసున్న 2,400 మంది పిల్లలు ఉన్నట్టు గుర్తించామని, గురువారం నుంచి మూడు రోజుల పాటు ఇం టింటా సర్వే నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య శాఖ కార్యకర్తలు 139 మంది అనారోగ్యంగా ఉన్న పిల్లల్ని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తారన్నారు. 15 మంది వైద్యులతో గుర్తించిన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాల్లో వైద్యులతో పాటు ఇతర శాఖల సిబ్బంది. రెడ్‌క్రాస్ సభ్యులు, ఎన్జీవోలు సేవలందిస్తారన్నారు. రోగులకు అత్యవసర చికిత్స అందించే క్రమంలో చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఒక ప్రత్యేక హెల్త్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. 08864-299936, 9491645405, 9491650820 నెంబర్లు 24 గంటలూ పని చేస్తాయన్నారు. 108 అవసరం ఉన్నవారు టోల్‌ఫ్రీ నెంబరు ఫోను చేయాలని, అంబులెన్సు ఆలస్యం అవుతుందన్న సమాధానం వస్తే బాధిత కుటుంబీకులు ఐటీడీఏ హెల్త్ సెల్‌కు కాల్ చేయవచ్చన్నారు.



దేవీపట్నం మండలం ఇందుకూరుపేట సమీపంలో పొంగిన ఇనుగొండ వాగు

పొంగిన వాగులు

దేవీపట్నం, ఆగస్టు 7: మండలంలోని ఇనుగొండ, వెలగపల్లి, సీతపల్లి వాగులు పొంగి ప్రవహించాయి. వాహనచోదకులు, ప్రయాణికులు సుమారు నాలుగు గంటలసేపు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జనజీవనం స్తంభించిపోయింది. మండలంలోని వి.రామన్నపాలెం పంచాయతీ వెలగపల్లి గ్రామంలోని లక్ష్మీపురం-గుంపెనపల్లి రోడ్డు మధ్యలో ఉన్న వాగు దాటడానికి బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని టీడీపీ నేత కొండ్ల చిన కొండారెడ్డి డిమాండ్ చేశారు.

కూనవరం: మండలంలో బుధవారం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యోగులు విధులకు హాజరుకాలేకపోయారు. విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లలేకపోయారు.

ఎటపాక: మండలంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు, ప్రాజెక్టులు, పంట పొలాలు నిండాయి. పలు గ్రామాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో వరద నీరు రోడ్లపైకి, ఇళ్లల్లోకి ప్రవహించింది. ఇప్పటికే సాగు చేసిన పత్తి పొలాల్లో అక్కడక్కడా వరద చేరడంతో రైతులు మళ్లించే ప్రయత్నం చేశారు. కృష్ణవరం గ్రామ శివారులో కల్వర్టు వద్ద రహదారిపై మోకాళ్ల లోతునీరు చేరడంతో గిరిజనులు ప్రమాదపుటంచున రాకపోకలు సాగించారు.



35 మందిని వరించిన 'వరలక్ష్మి కానుక'

దేవీపట్నం, ఆగస్టు 7: మండలంలోని ఇందుకూరుపేట హైస్కూలు మైదానంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వరలక్ష్మి కానుక-2 లక్కీ డ్రాలో 35మంది గెలిచారు. వారికి ఒక్కొక్కరికి రూ.7,500 విలువ చేసే ఒక గ్రాము బంగారు వరలక్ష్మి డాలర్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథ రావుశర్మ, రావిపాటి గోవిందు, బీజేపీ నాయకుడు కారం రామన్నదొర, జనసేన నేతలు చారపు రాయుడు, ఈత శివాజీ పాల్గొన్నారు.

'ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి'

రంపచోడవరం, ఆగస్టు 7: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు పి.సోమన్న, పి.పాపన్న కోరారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాజ్యాంగపరమైన ఆదివాసీ హక్కుల అమలు సాధనకు ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు వెన్నుదన్నుగా నిలవాలని వారు పిలుపునిచ్చారు.

బిడ్డ పెంపకంలో తల్లి పాత్ర ఎంతో కీలకం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సీమంతం, అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 7 : తల్లిపాల విశిష్టత ప్రాచుర్యం పొందే విధంగా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్య కర్తలపై ఉందని గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చేవరకు తల్లి పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జాతీయ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ రంగంపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసం గించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం జరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు తల్లిపాల విశిష్టతను ప్రతి గర్భిణీకి తెలియజేయాలన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి మాట్లాడుతూ గర్భిణీ దశ నుంచి బాలింత దశ వరకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సూచనలు సలహాలు పాటిస్తూ పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షిస్తూ సీమంతాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన 60మంది గర్భిణులకు ఎమ్మెల్యే సీమంతం కార్యక్రమాలు నిర్వహించి చీర సారె అందించి ఆశీర్వదించారు. పలువురు చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని కూడా ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్, సూపర్‌వైజర్లు ఛాయాదేవి, అంజలి, నందేశ్వరి, కూటమి నాయకులు కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, సుభాషిణి, మల్లేశ్వరి, సిరసపల్లి లక్ష్మీ, ఒంటిమి గౌతమి, కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కడియం, ఆగస్టు 7: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలపై ఉందని కడియపులంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జెస్సీ సుప్రియ తెలిపారు. కడియపులంక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డా. జెస్సీ సుప్రియ మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో కడియపులంక, పొట్టిలంక, దుళ్ల, వీరవరం, మురమండ గ్రామాలకు దోమలు పెరుగుదల నివారించే ఎబేట్ దోమల మందు, సైఫెనోత్రిన్ పొగమందు పంపిణీతోపాటు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో డీజిల్ మడ్డిఆయిల్ బాల్స్ వేయించడం వంటి చర్యలు జరుగుతున్నాయని వాటిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసి స్టెంట్‌లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత భవన్ ఏర్పాటు చేసి నేత కార్మికులకు శిక్షణ

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



పొట్టిలంకలో చేనేత దినోత్సవ కార్యక్రమంలో కేకు కట్ చేస్తున్న మహిళలు

కడియం, ఆగస్టు 7: మండలంలో చేనేతభవన్ ఏర్పాటు చేసి నేత కార్మికులకు శిక్షణ ఇచ్చేవిధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. బుధవారం పొట్టిలంకలో జాతీయ చేనేత దినత్సోవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో నేత పరిశ్రమ చిరునవ్వులు పూసాయని, ప్రస్తుతం చేనేత కార్మికులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిశ్రమను పనికి ఆహార పథకంలో చేర్చాలని సీఎం చంద్రబాబునాయుడును గతంలో కోరామన్నారు. దీని ద్వారా నేత కార్మికులకు కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందుకు సహకరించాల్సి ఉందని, ఎన్డీయే కూటమిలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకుంటారన్నారు. అనంతరం కేకు కట్ చేసి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణ, కలిదిండి గోవిందు, కొత్తపల్లి శ్రీరామ్, ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంలో పాఠ్యాంశాలు బోధించాలి



రాజానగరం పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి

రాజానగరం, ఆగస్టు 7: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నూతన విద్యా విధానాలకు అనుగుణంగా బోధించా లని ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. రాజానగరంలోని ఎంపీపీ పాఠశాల-2ను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల వర్క్ బుక్స్ తనిఖీచేసి, లోపాలు గుర్తించి తగు సూచనలు చేశారు. లెసన్ ప్లాన్లు, డైరీల సిలబస్‌కు అనుకూలంగా ఎప్పటికప్పుడు నూతన విధానంలో తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే కేవీకే ధ్యేయం

● ప్రధాన శాస్త్రవేత్త నాయుడు

రాజానగరం, ఆగస్టు 7 : వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కేవీకే పనిచేస్తుందని కలవచర్లలోని కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వివిఎస్‌జిఆర్ నాయుడు అన్నారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)సహకారంలో కలవచర్ల కేవీకేలో నర్సరీ యాజమాన్యం, ఉద్యాన పంట ల్లో అంటుకట్టు విధానాలు అనే అంశాలపై గ్రామీణ యువతకు వారం రోజులపాటు నిర్వహించే నైపుణ్య శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా నాయుడు మాట్లాడుతూ శిక్షణ ద్వారా గ్రామీణ యువత లబ్ధి పొంది ఉపాధి అవకాశాలుగా మలచుకోవా లన్నారు. గ్రామీణ యువత, మహిళలకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినూత్న సాంకేతిక తను అందించడంలో కేవీకే తోడ్పడుతుం దన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆర్థిక భాగస్వామ్యంతో యువత కోసం ఏర్పాటు చేసిన ఈశిక్షణా కార్యక్రమాలను సద్విని యోగం చేసుకోవాల న్నారు. శిక్షణ ద్వారా లబ్ధిపొందిన యువత వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సంహాయం పొంది వ్యాపార సరళిలో నర్సరీలు స్థాపించి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని చెప్పారు. కేవీకే ఉద్యాన విభాగ అధికారిణి జేవీఆర్ సత్యవాణి నర్సరీల నిర్వహణ ఉద్యాన పంటల యాజమాన్యాల ఆవశ్యకతను వివరించారు. కేవీకే సిబ్బది రఘు వీర్, బీఎస్ రెడ్డి, సంజయ్, రవీందర్, విజయవర్ధన్, ప్రభాత్, రాజానగరం, జగ్గంపేట, కడియం, గొల్లప్రోలు మండలాలకు చెందిన యువత పాల్గొన్నారు.

పని సర్దుబాటుపేరుతో పాఠశాలల మూసివేత తగదు

● ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాధబాబు

దివాన్‌చెరువు, ఆగస్టు7 : పనిసర్దుబాటు పేరుతో పదిమందిలోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని పాఠశాల విద్యాశాఖ ఆలోచించడం అనాలోచిత నిర్ణయం అని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్, రాష్ట్ర నాయకులు సూరి జయత్రినాధబాబు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలు ఉపసంహరించుకోవాలని కోరారు. పి.ఆర్.సి.అమలు చేసేలోపు ఐ.ఆర్ 30శాతం ప్రకటించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు పి.వి.వి. భీమేశ్వరరావు, ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లికి భద్రత పెంపు

అనపర్తి, ఆగస్టు 7: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డికి ప్రభుత్వం భద్రతను పెంపుదల చేసింది. ఇప్పటివరకు ఒన్ ప్లస్ ఒన్‌గా ఉన్న పీఎస్‌వోలను టు ప్లస్ టుగా పెంపుదల చేశారు. నియోజకవర్గ పర్యటన లోను బయట పర్యటనలలోను నల్లమిల్లిపై దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటిలిజెన్స్ ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం నల్లమిల్లికి భద్రత పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

ముత్యాల పోసికుమార్‌కు సత్కారం

ధవళేశ్వరం, ఆగస్టు7: శ్రీకృష్ణదేవరాయులు పట్టాభిషేకం జరిగిన రోజు గుర్తు చేసుకుంటూ గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కాపు జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో కాపు ప్రముఖులకు నిర్వహించిన సత్కారంలో భాగంగా తనకు జరిగిన సత్కారానికి స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, కాపు జేఏసీ నాయకుడు ముత్యాల పోసికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగించండి

● ఆవ చానల్ పరిశీలనలో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 : రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు అడ్డంకులు లేకుండా డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని ఆవచానల్ డ్రెయిన్లు, అనుసంధాన డ్రైనేజీలను బుధవారం పరిశీలించారు. డ్రైయిన్‌లో సిల్ట్ పేరుకుపోయిందని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆవ చానల్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నగరంలో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, డీఈఈ ప్రకాశరావు, అసిస్టెంట్ ఇంజనీరు శ్రీధర్ పాల్గొన్నారు.

జగన్ రాజకీయాల నుంచి కనుమరుగవడం ఖాయం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: ఘోర ఓటమితో జగన్‌కు మతిభ్రమించిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలత ప్రతిపక్ష హోదా కావాలనడం, రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్లు రాష్ట్రపతిపాలన విధించాలని అనడం అటుపై ఇప్పుడు తనకు ముఖ్యమంత్రి స్థాయి సెక్యూరిటీ కావాలని కోర్టుకు వెళ్లడం చూస్తుంటే జగన్ రాజకీయాల నుంచి కనుమరుగవడం ఖాయమనిపిస్తుందన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

● ఉచిత విద్య జీవో అమలు చేయాలని ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం ఆర్‌టీఈ 12(1) సీ 2024-25 ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు కేటాయింపులు చేయని విద్యాసంస్థ లపై చర్యలు తీసుకోవాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు డిమాండ్ చేశారు. స్థానిక డీవైఈవో కార్యాలయం వద్ద బుధవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నగరంలో శ్రీగౌతమి, భారతీయ విద్యాభవన్ పాఠశాలలు జీవోను అమలు చేయడం లేదని ఆరోపించారు. అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శివకుమార్, ములగాడ బాబ్జి, నేకూరి రవి, మూగంటి శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 7 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఒకటో వార్డులోని నారాయణపురం మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు ఎన్‌డీఏ కూటమి నాయకులు బుధవారం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. స్కూల్‌లో విద్యార్థులకు వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. వంటశాల, బాత్రూమ్‌లు పరిశీలించి టీచర్లకు సూచనలు చేశారు. కూటమి నాయకులు వేల్పూరి శ్రీనివాస్, రెడ్డి రమణ, కాటూరి ఏసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు సాధ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైతన్యరాజు

రాజానగరం, ఆగస్టు 7 : తరగతులకు నూరు శాతం హాజరై సబ్జెక్టులను శ్రద్ధగా విని వాటిపై పట్టు సాధిస్తే బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం సుసాధ్య మని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) కులపతి, చైతన్య సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు)అన్నారు. గైట్ అటానమస్ కళాశాల మొదటి ఏడాది ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా చైతన్యరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆకాంక్షలను నెరవేర్చే విధంగా నిరంతరం కృషి చేయాలన్నారు. ఉపకులపతి శశికిరణ్ వర్మ మా ట్లాడుతూ జిజియులో క్రెడిట్ బేష్ ఛాయిస్ సిస్టం అమలు చేస్తున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మీ శశివర్మ, రిజిస్ట్రార్ పీఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, డీన్‌లు శ్రీనివాసరావు, ఎన్.లీలావతి, యు.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వేసిన అక్రమ లేఔట్‌ను ధ్వంసం చేసిన అధికారులు



వడిశలేరు లేఔట్‌లో దున్నిన రోడ్డు

రంగంపేట, ఆగస్టు 7 : రంగంపేట మండలం వడిశలేరు గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా అక్రమంగా వేసిన లేఔట్‌ను బుధవారం వడిశలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారాయుడు, సిబ్బంది కలిసి లేఔట్‌లో నిర్మించిన ప్రహరీ గోడలు, రోడ్లను ఎక్స్‌కవేటర్ తో పడగొట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుబ్బారా యుడు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రంగంపేట మండలం వడిశలేరు పంచాయతీ పరిధిలో గల కార్గిల్ ఫ్యాక్టరీ దగ్గర ఉన్న గన్ని భాస్కరరావు పామాయిల్ తోట వెనుకగల సర్వే నెంబర్ 365/3,367,368,368/ ఎ,368/బి, 368/సి,368/డి,369,370, 371,372/2,373/ 2,374/2,375/1 లలో ఎ15.54 సెంట్లు భూమిలో 2021-22లో అనుమతిలేకుండా అక్రమంగా గరికిపాటి డెవలపర్స్ పేరుతో లేఔట్ నిర్మించారన్నారు. తాను పంచాయతీ కార్యదర్శిగా జాయిన్ అయ్యాక ఒకటి, రెండు, మూడవసారికూడా నోటీసు జారీ చేశామన్నారు. ఈ పొలంలో వేసిన లేఔట్‌లో సంబంధిత అధికృత అధికారి అనుమతి పొందలేదని, కట్టడాలు అన్నీ 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట ప్రకారం నిషేధం అని సూచిక బోర్డు పెట్టామన్నారు. గరికిపాటి వెంకటేశ్వరరావు, అదర్స్ నోటీసులు జారీ చేసినా, బోర్డు పెట్టినా స్పందించకపోవడంతో 1994ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రుడా వారి లెటర్ ప్రకారం లేఔట్‌లోని కట్టడాలను పగలగొట్టించి, ఎక్స్‌కవేటర్‌తో రోడ్లను తొలగించామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

అసెంబ్లీకి వచ్చి సెక్యూరిటీ పెంచమని అడగండి

● జగన్మోహనరెడ్డిపై సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 7 : వైఎస్ జగన్మోహనరెడ్డి ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే. ఆయనకు సెక్యూరిటీ ఎందుకు పెంచాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంగా ఉన్న చంద్రబాబుకు మించి సెక్యూరిటీ అడుగుతున్నారంటే, ఆఫ్రికా వంటి ప్రాంతాల నుంచి ఇంటర్నేషనల్ త్రెట్ ఏమైనా ఉందా అనేది చెప్పాలన్నారు. సెక్యూరిటీ పెంచాలంటే అసెంబ్లీకి వచ్చి అక్కడ కారణాలు చెప్పి సెక్యూరిటీ పెంచమని అడిగితే మీ కోసం మేమంతా వెళ్లి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేసి వేడుకుంటాం అన్నారు. అసెంబ్లీకి రాకుండా రాష్ట్రంలో అల్లరిచిల్లరిగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ నాకు భద్రత లేదని చెప్పడం సరికాదన్నారు. ముందుగా సీఎం అనే ఫోబియా నుంచి జగన్ బయటకు రావాలని కోరుతున్నామన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో ఎమ్మెల్యేపాత్ర కూడా నిమిత్త మాత్రమే అన్నారు. హై కమాండ్ సుప్రీం, వాళ్ల అన్ని కోణాల్లో చూసి అర్హులను ఎంపిక చేస్తారన్నారు.

వయా దివాన్‌చెరువు టూ ద్వారపూడికి ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 7 : రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వయా దివాన్ చెరువు నుంచి ద్వారపూడికి ఆర్టీసీ అధికారులు కొత్తగా బస్సు సౌకర్యం కల్పించారు. ప్రతిరోజూ ఉదయం 5.50 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఈ బస్సు బయలుదేరి గోకవరం బస్టాండు మీదుగా లాలాచెరువు, దివాన్‌చెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, కొత్తతుంగపాడు మీదుగా ద్వారపూడి వెళుతుంది. 7 గంటలకు ద్వారపూడి చేరుకుని వెంటనే బయలుదేరి తిరిగి ఇదే రూటులో రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుంది. మళ్లీ మధ్యాహ్నం 2.20 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరుతుంది. సాయంత్రం 3.30 గంటలకు ద్వారపూడి చేరుకుంటుంది. తిరిగి 3.50గంటలకు ద్వారపూడిలో బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుంది. ప్రతిరోజూ రెండు ట్రిప్పులు ఈ బస్సు నడుస్తుందని ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్బం తెలిపారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేయాలి

● ఏపీఎస్ఈబీ ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా కార్యవర్గం



ఏపీఎస్ఈబీ ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేయాలని ఏపీఎస్ఈబీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది. రాజమహేంద్రవరం మోరంపూడి ఇంజనీరింగ్ గెస్ట్ హౌస్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎస్ఈబీ ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడిగా వై.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడిగా వి.కాంతారావు, జిల్లా కార్యదర్శిగా జి.రాంజేంద్రప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా జి. రమేష్, జిల్లా ముఖ్యసలహాదారులుగా విడి.సర్వేశ్వరరావు, జిల్లా సలహాదారులుగా కె.మోహన్ రావు, డి.రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు ఎం . నిర్మల మూర్తి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి.కిరణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిజె.సుధాకర్, ఉమ్మడి జిల్లాలో తొమ్మిది డివిజన్ల నుంచి నాయకులు అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


బీపీ మండల్ ఆశయ సాధనకు పోరాటం

● బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్



బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: బీపీ మండల్ ఆశయ సాధనకు బీసీ యువజన పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధినేత రామచంద్రయాదవ్ అన్నారు. బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ డే సందర్భంగా రాజమహేంద్రవరం బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించి నివాళులర్పించారు. మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి పూర్తిస్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతికి బిపి మండల్ ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు ఆయన సిఫార్సులను తుంగలో తొక్కుతున్నాయన్నారు. గత సీఎం జగన్ బీసీలను విస్మరించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.బీసీ ల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీవై పార్టీ నాయకులు అత్తిలి రాజు, బిపి మండల్ అభిమానులు పాల్గొన్నారు.



తగ్గిన గోదావరి వరద

ధవళేశ్వరం, ఆగస్టు 7 : గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బుధవారం రాత్రి 8గంటలకు నీటిమట్టం 7.50 అడుగులుగా నమోదు కాగా 4.50 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. గోదావరి సాధారణ స్థాయికి చేరినట్టు అధికారులు చెబుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల భద్రాచలం వద్ద నీటి మట్టం స్వల్పం గా పెరుగుతూ 35.30 అడుగులకు చేరుకుంది.

కురిసింది చిరుజల్లు..



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 : జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి చెదురుమొదురు గా వర్షం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా 39.6 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలి పింది. అత్యధికంగా రాజానగరంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా బిక్కవోలులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలో కోరుకొండలో 5.4 మి.మీ, రంగంపేట 5.0 మి.మీ, చాగల్లు 4.0, తాళ్ళపూడి 3.6 , రాజమహేంద్రవరం రూరల్ 2.6 , ఉండ్రాజవరం 2.6, నిడదవోలు 2.4, అనపర్తి 1.8, గోపాలపురం 1.6 , సీతానగరం 1.0, గోకవరంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 2.1 శాతం వర్షం పడింది.

కొండ జారిన బండరాయి..



గోకవరం, ఆగస్టు 7 : తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం(కొండ) పైనుంచి బుధవారం పెద్ద రాయి కిందకు జారి పడింది. కొండకు సమీపంలో నివసిస్తున్న గృహల మధ్యకు రాయి జారుకుంటూ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రాయి కాస్త గట్టిగా జారి ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించేది. పెద్ద ఎత్తున ప్రాణాలు పోయేవి. అదృష్టవశాత్తు ఏ ఒక్కరికీ ప్రమాదం సంభవించలేదు. దీంతో ఆ దేవుడే తమను కాపాడాడని కొండ పరిసర ప్రాంత వాసులు చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండపై మట్టి కరిగి రాయి జారి పడిఉంటుందని భావిస్తున్నారు.రాయి జారి పడిన ప్రాంతాన్ని టీడీపీ నాయకుడు బదిరెడ్డి బాబీ,వీఆర్వో లచ్చిరెడ్డి పరిశీలించారు.

రావిచెట్టు కొట్టారని కేసు..



కొవ్వూరు, ఆగస్టు 7 :కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అనుమతుల్లేకుండా దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలే తీసుకుంటామని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు.బుధవారం కొవ్వూరు మండ లం కుమారదేవం విచ్చేసిన కలెక్టర్ ప్రశాంతి దృష్టికి దేవతావృక్షం నరికివేసిన ఉదంతాన్ని తీసుకెళ్లారు.దీనిపై స్పం దించిన ఆమె విచారించాలని సబ్‌కలెక్టర్‌కు సూచించడంతో రావిచెట్టును పరిశీలించారు.దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తు లపై వాల్టా చట్ట ప్రకారం కేసు నమోదు చేయించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబును ఆదేశించారు.ఈ మేరకు వీఆర్వో సైదారాణి పోలీసులకు ఫిర్యాదుచేశారు. నరికివేసిన చెట్టుకొమ్మలు చిగురించే లా కెమికల్ ట్రీట్‌మెంటు ద్వారా చర్యలు తీసుకుంటామని రాజమండ్రి రోటరీక్లబ్ ప్రతినిధి తీగెల రాజా తెలిపారు.

2027 గోదావరి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: 2027లో రాబోయే గోదావరి పుష్కరాలకు ముందస్తు కార్యచరణ రూపొందిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ నరసింహకిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్, పలు శాఖల అధికారులతో సమీక్షించారు. 2027 పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని ఇప్పటి నుంచే ఏర్పాట్లు కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నిర్వహించాలన్నారు.పుష్కర ఘాట్లకు వచ్చే సాధారణ భక్తులకు ,వీఐపీలకు ఘాట్‌లకు వచ్చే ట్రాఫిక్ నియంత్రించే విధంగా వేర్వేరు మార్గాలను కేటాయించాలన్నారు. ఘాట్స్‌కు వెళ్లే మార్గాలకు సంబంధించి రోడ్ రూట్ మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు కార్యాచరణతో సిద్ధం చేసుకోవాలన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా భక్తులను రేవుల నుంచి బయటకు పంపించే విధంగా రూట్ మ్యాప్‌ను రూపొందించాలన్నారు.సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, నగరపాకల సంస్థ ఎస్ఈ జి.పాండురంగారావు, ఆర్ అండ్‌బీ ఈఈ ఎస్‌వీబీ.రెడ్డి, డీపీవో ఎం రాంబాబు, ఆర్టీసీ డీపీటీవో ఎం.షర్మిళ అశోక్, డీటీవో కేఎస్ఎంవి కృష్ణారావు, ఆర్‌డీవో ఎఫ్ఏసీ కేఎల్ శివజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై సీఎంకు బత్తుల విన్నపం

సీతానగరం,ఆగస్టు 7 : సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో పురుషోత్తపట్నం,చినకొండేపూడి,నాగంపల్లి గ్రామాల్లో 75 ఎకరాలకు 92 మందికి నష్టపరిహారం అందలేదని శాసన సభలో సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీగా రమేశ్ బాబు



రాజమహేంద్రవరం,ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ డీఎస్పీగా కె.రమేశ్ బాబు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నరసింహ కిశోర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.1989 బ్యాచ్‌కి చెందిన రమేశ్ మచిలీ పట్నం జిల్లా శిక్షణ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు.గతంలో 2016 నుంచి 2018 వరకూ ఈస్ట్ జోన్ డీఎస్పీగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని శాంతి భద్రతలపై ఇప్పటికే తనకు అనుభవం ఉందన్నారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పని చేసిన విజయపాల్ వీఆర్‌కి వెళ్లిన విషయం తెలిసిందే.

బోధనా స్కిల్స్‌పై ఐదు రోజులు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 7 : డిగ్రీ కళాశాలల అధ్యాపకులు బోధనా స్కిల్స్ పెంచుకోవాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రాజమండ్రి నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు డిగ్రీ కళాశాల అధ్యాపకులకు బోధనా స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పోలా భాస్కర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మనసును, శరీరాన్ని సమన్వయం చేసుకోగలగడం, భావ ప్రజ్ఞను కలిగి ఉండడం వంటి నైపుణ్యాలపై శిక్షణ అత్యంత అవసరమన్నారు. నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్,అధ్యాపకులు, కీ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



కానిస్టేబుళ్ల ఎదురుచూపులు

- రెండేళ్లుగా నిలిచిన బదిలీలు
- 150 మంది అర్జీలు
- 120 మందితో జాబితా సిద్ధం
- డీజి ఆదేశాలతో బ్రేక్
- ఎంతో మంది ఐదేళ్లుగా ఒకేచోట
- అయినా నేటికీ బదిలీల్లేవ్
- పిల్లల స్కూల్స్‌పై ఆందోళన
- ఇప్పటికీ పట్టని వైనం
- ఇకనైనా తేల్చాలని పట్టు
- సజావుగా అధికారుల బదిలీ
- ఎస్పీ స్పందించాలని డిమాండ్

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కానిస్టేబుల్స్ బదిలీల్లో తీవ్ర జాప్యం జరుగు తోంది. వాస్తవానికి ఎస్పీ కంటే ముందుగానే వారి బదిలీల జాబితా సిద్ధమైంది. ఎస్పీ జగదీశ్, ఐదుగురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు బదిలీ అయ్యారు. కానీ సుమారు రెండు నెలల కిందట నుంచీ ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్ల బదిలీ మాత్రం డీజీ ఆదేశాలతో ఎస్పీ సంతకం దగ్గర ఆగిపోయాయి. వాస్తవానికి పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా ప్రతి ఏడాదీ స్కూల్స్ తెరిచే నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేయ డం రివాజు.కానీ ఎన్నికల తర్వాత ఆ మాటే మరిచారు. దీంతో కానిస్టేబుళ్ల కుటుంబాలు పిల్లల స్కూల్స్ విషయంలో ఆందోళన చెందుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అయోమయం..

ఎక్కడికి బదిలీ చేస్తారో తెలియక కానిస్టేబుళ్లు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్‌స్పెక్టర్ నుంచి పైస్థాయి వరకూ అర్థబలంతో మేనేజ్ చేసుకొనే పరిస్థితి ఉంటుంది.కానీ హోంగార్డు నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ ఆర్థికంగా సతమతమవు తూనే ఉంటారు. పోస్టింగ్‌లకు పైసలు చెల్లించుకొనే పరిస్థితి ఉండదు.ఈ నేపథ్యంలో జిల్లాలోని కొందరు కానిస్టేబుళ్లు బదిలీలకు ఎదురు చూస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకూ బదిలీ చేసే అధికారం ఎస్పీ చేతిలో ఉంటుంది.ఐదేళ్లు దాటి బాగా ఎక్కువ కాలం ఒకే సీటులో తిష్ట వేసిన కానిస్టేబుళ్లు కొందరికి సుమారు రెండేళ్ల కిందట ఎస్పీగా సుధీర్ కుమార్ రెడ్డి స్థాన చలనం కలిగించారు.తర్వాత గతేడాది సెప్టెంబరులో ఎస్పీగా జగదీశ్ వచ్చారు.విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నా కొందరి అభ్యర్థనలు పరిగణన లోకి తీసుకుని బదిలీచేశారు.తర్వాత ఎన్నికలు రావడంతో డీవోలు ఆగిపోయాయి.ఐదేళ్లు మించి ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న వాళ్ల బదిలీలపై చర్యలు తీసుకోలేదు.దీంతో చాలామంది ఆరో ఏట అడుగు పెట్టేశారు.

నేటికీ కానరాని స్పష్టత..

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత బదిలీల క్రతువు మొదలైంది. జిల్లాలో ఉన్నతాధికారుల దగ్గర నుంచి ఎస్ఐ వరకూ స్థాన చలనం కలుగుతోంది. కానీ జాబితా సిద్ధమైనా ఇప్పటికీ కానిస్టేబుళ్ల విషయంలో ఒక నిర్ణయం వెలువడలేదు.ఎన్నికల తర్వాత బదిలీలకు కొందరు అర్జీలు పెట్టుకున్నారు. కానీ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటినా డీవోలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.రిక్వెస్టులు పెట్టుకున్న పోలీసులు బదిలీల ఆదేశాల (డీవో)కు ఎదురుచూస్తున్నారు. నరసింహ కిశోర్ ఎస్పీగా గత నెల 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇప్పటి వరకూ కానిస్టేబుళ్ల డీవోలపై ఎలాంటి చొరవా చూపలేదు. పోలీసులను ఎవరినీ బదిలీ చేయవద్దని కొత్త (కూటమి) ప్రభుత్వంలో డీజీగా ద్వారకాతిరుమలరావు బాధ్యతలు స్వీకరించగానే ఆదేశాలిచ్చారు.అయితే తర్వాత చాలా మంది అధికారుల బదిలీలు జరిగాయి.దీంతో కానిస్టేబుళ్ల విషయంలోనే ఆ ఆదేశాలు అమలు చేస్తున్నారా? లేదా? అనే అయోమయం ఉంది.ప్రతి ఏడాదీ బదిలీలు చేయాల్సి ఉన్నా రెండేళ్ల నుంచీ క్రమం తప్పింది. తర్వాత ఎన్నికల వల్ల సాధ్యపడలేదు.బదిలీలు ఉంటే త్వరగా ఆదేశాలు ఇవ్వాలని, లేకపోతే స్పష్టంగా చెప్పాలని డిపార్ట్‌మెంట్‌లో చర్చ సాగుతోంది.ఇలా తాత్సారం చేసి విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేస్తే ఇబ్బందులు తప్పవని అంటున్నారు.సిద్ధంగా ఉన్న డీవోల వరకైనా తేల్చాలని అభ్యర్థిస్తున్నారు.

120 మందితో జాబితా రెడీ..

జిల్లాలోని బదిలీలకు సుమారు 150 మంది కానిస్టేబుళ్లు అర్జీలు పెట్టుకున్నారు.తగు వడపోత తర్వాత గత ఎస్పీ జగదీశ్ 120 మంది బదిలీలకు ఆదేశాలు సిద్ధం చేశారు.కానీ చివరి నిమిషంలో డీజీ ఆదేశాలతో బదిలీలు ఆగిపోయాయి. తర్వాత వాటిని పట్టించుకోవడం మానేశారు. చిన్నస్థాయి ఉద్యోగులు కావడంతో ఉన్నతాధికారులను అడిగితే ఎటు తిరిగి ఎటు వస్తుందో అనే భయంతో ఎవరూ సాహసం చేయ డం లేదు. ముఖ్యంగా పిల్లలను స్కూల్‌లో చేర్చే విష యంలో తర్జనభర్జన పడుతున్నారు. భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పని చేసే వాళ్లు, పెద్దవాళ్లకు ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. డీవోలు తాము కోరుకున్నట్టు వస్తే సమస్య తీరుతుందని ఆశ పడుతున్నారు.అర్జీలు పెట్టుకున్న వాళ్లే కాకుండా ఐదేళ్లకు మించి ఒకేచోట పాతుకుపోయిన వాళ్లపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం కనిపి స్తోంది. ఒక చోట డీవో ఉన్నా తాము కోరుకున్న చోట ఏళ్ల తరబడి పాతుకుపోయి వాళ్లూ ఉన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.



చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

చేనేత వస్త్రాలు ఆన్‌లైన్‌లో విక్రయించాలి

జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

అనపర్తి, ఆగస్టు 7 : మార్కెట్లో వినియోగదారులను ఆకర్షించే విధంగా చేనేత ఉత్పత్తులు రూపొందించి.. ఆన్‌లైన్‌లో విక్రయాలపై నేత కార్మికులు దృష్టి సారించాల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం అనపర్తి మండలం పులగుర్తలో చేనేత పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్ఎంఎస్ఎస్, ముద్ర లోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులను ఆకర్షించే విధంగా నూతన డిజైన్లతో వస్త్రాలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేనేత సొసైటీలు ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పులగుర్త, పందలపాక, పసలపూడి, ఎస్టీ రాజాపురం, పెదపూడి సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నేత కార్మికులను కలెక్టర్ ప్రశాంతితో కలిసి సత్కరించారు.కార్యక్రమంలో పులగుర్త సొసైటీ కార్యదర్శి దంతంశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే,కలెక్టర్‌లను సత్కరించారు.ఈ కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.ధనుంజయరావు, అలోక్ రంజన్, బి.కృష్ణ భాస్కర్, బి.తవిటినాయుడు, కె.గంగరాజు, డి.వీరవెంకట సత్యనారాయణ, పేరిశెట్టి లాలయ్య, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ



గోకవరంలో పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

గోకవరం, ఆగస్టు7: జిల్లాలో గంజాయి, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. గోకవరం పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ విధి విధానాలు, శాంతి భద్రతలు,సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ అవుట్ పోలీస్ స్టేషన్ పరిశీలించారు.మండలంలో మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాలపై దృష్టి సారించాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు.ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగమురళీ, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.



నీట మునిగిన ఊరు : శ్రీరంగపట్నంలో రోడ్డుపై నీరు



నిండుగా : ఉధృతంగా బురద కాలువ

ముంచేసిన బురద కాలువ

శ్రీరంగపట్నం వద్ద కాలువకు గండి

- రోడ్డుపై పారుతున్న వరద నీరు
- నీట మునిగిన వేలాది ఎకరాలు
- 10 గ్రామాలకు రాకపోకలు బంద్

కోరుకొండ,ఆగస్టు 7 : బురద కాలువకు గండి పడింది.. పంట చేలను ముంచెత్తింది. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం అచ్చుతాపురం గ్రామాల సరిహద్దుల పంట పొలాల వద్ద బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ఎక్కువై బురద కాలువకు గండిపడింది. ఈ వరద నీరు శ్రీరంగపట్నం గ్రామాన్ని ముంచేసింది. వేలాది ఎకరాలు నీటి ముంపులో ఉండిపోయాయి. శ్రీరంగపట్నం గ్రామ రోడ్లపై బురద కాల్వ ఉధృ తంగా ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి నెల్లిపూడి వాగులోకి వరద చేరుతోంది. ఆ వరద నీరు సూరంపాలెం రిజర్వాయర్ గేట్లు ఎత్తి బురద కాలువ విడుదల చేస్తున్నారు. ఆ కాలువ ద్వారా కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో 22 కిలోమీటర్ల మేర ప్రవహించి గోదావరి నదిలో కలవాల్సి ఉంది. బురద కాలువ ఆక్రమణకు గురికావడం, గట్లు బలహీనం కావడం, కాలువకు అడ్డంగా అనధికార చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయ డం తదితర కారణాలతో గండి పడింది. దీంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీరంగపట్నం మీదుగా కోరుకొండకు వచ్చే కోటికేశవరం, కోటి, రాఘవాపురం, బొల్లేద్దుపాలెం, గరగలంపాలెం, అచ్చియ్యపాలెం, నాగంపల్లి, నల్గొండ, చీపురుపల్లి, తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. నెల రోజుల్లో బురద కాలువ వరద నీరు శ్రీరంగపట్నంను నాల్గోసారి తాకింది.



ముంచినది : శ్రీరంగపట్నంలో నీట మునిగిన పంట చేలు

50 ఏళ్లుగా తీరని సమస్య

కోరుకొండ మండలంలో శ్రీరంగపట్నం గ్రామంలో గత 50 ఏళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.14 వేల జనాభా ఉన్నా పాలకులు బురద కాలవ ముంపునకు శాశ్వత పరిష్కారంచూపించకపోవడంతో ప్రతి ఏడాది ఇంతే.ఈ కాలువ వరద వల్ల ప్రతి సంవత్సరం శ్రీరంగపట్నం, మునగాల, కోటి, బుచ్చింపేట, బూరుగుపూడి,గుమ్ముళ్ళూరు, కాపవరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో కోట్లాది రూపాయల విలువైన పంటలకు నష్టం వాటిల్లుతుంది. బురద కాలువ వరద నుంచి తమను రక్షించమని ప్రజలు వేడు కుంటూనే ఉన్నారు.వరదలు వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనం తప్ప ఈ నాటి వరకు శాశ్వత పరిష్కారం చూపించలేదు. కాలువ తాకిడికి కోరుకొండ, సీతానగరం, గోకవరం, మండల పరిధిలోని అనేక ఆర్అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రోడ్లు దెబ్బతింటున్నాయి.అధికారులు రంగంలోకి దిగి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యాయం కావాలని అత్తింటి ఎదుట

వివాహిత దీక్ష

8

ఏసీబీ డీఎస్పీగా కిశోర్ బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్‌లోని డీఎస్పీ- 2గా ఎం.కిశోర్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఈ రేంజ్ పరిధిలోకి వస్తాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఈస్ట్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఆయన ఏసీబీకి వెళ్లారు.



శింగరాజుపాలెంలో పర్యటిస్తున్న ఎంపీడీవో,వైద్య బృందం

రోగుల నుంచే రక్త నమూనా సేకరణ

నల్లజర్ల, ఆగస్టు 7: ప్రభుత్వ ఆసుపత్రులకు దూ రంగా ఉన్న గ్రామాల్లో వైద్య బృందం వెళ్లి ఇంటింటి సర్వే చేసి అనారోగ్యంతో ఉన్న వారి వద్ద నుంచి రక్త నమూనాలు సేకరించి రక్త పరీక్షల అనంతరం వారి ఇంటికివెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ తెల్లం గంగాధర్, ఉద్యోగుల సంఘం కన్వీనర్ జీ.వీ.వి ప్రసాద్ పేర్కొన్నారు. వారి వినూత్న సర్వీస్‌ను పరిశీలించేందుకు ఎంపీడీవో నవీన్‌కుమార్ బుధవారం సింగరాజుపాలెం, కొండయకుంట గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు శుభ్రంగా ఉండే విధంగా కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీ వో సూచించారు. మురుగు నీరు నిల్వ లేకుండా గ్రా మంలో బ్లీచింగ్ చల్లించాలన్నారు. సర్పంచ్ గడ్డె తిలక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'రజకుల చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి'



కురుకూరులో కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

దేవరపల్లి, ఆగస్టు 7: రజకుల చెరువులు ఆక్రమ ణలకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. దేవరపల్లి మండలం కురుకూరులో రజకులకు కేటాయించిన రంగంచెరువు లీజు 3సంవ త్సరాలకు రూ.8వేలకు పాడుకుని రజకుల సంఘం ఆధ్వర్యంలో సొమ్ములు చెల్లించామని కట్లయ్య బుధవారం తెలిపారు. కట్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు డివిజనల్ పంచాయతీ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు రజకులకు చెరువులు 15రోజుల ముందుగా నోటీసులు రజకులకు అందజేశారని ఆయన తెలిపారు. ప్రధాన పంచాయతీల్లో రజకుల చెరువులవద్ద వివాదాలు లేకుండా చెరువుగట్లపై ఉన్న గడ్డి, చెట్లు కూడా రజకులకు అనుమతి ఇవ్వాలని కోరారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి రవికిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు కోటిచుక్కల అప్పారావు, టేకు కృష్ణవేణి, సత్యనారాయణ, పాలూరు గంగాధర్, కోటిచుక్కల సత్యనారాయణ, పాలూరి చంద్రశేఖర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

దేవరపల్లి, ఆగస్టు 7: భారతరాజ్యాంగంపై విద్యార్థులకు బాలోత్సవ కమిటీ పోటీపరీక్షలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ పోటీ పరీక్షల్లో 40 మంది బాలబాలికలు పాల్గొన్నారని వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలిచిన విద్యార్థులకు అందజేస్తామని కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు తెలిపారు. ప్రథమ బహుమతి అంజూశ్రీ, ద్వితీయ బహుమతి దీపిక, తృతీయ బహుమతి సౌజన్య గెలుపొందారు. కార్యక్రమంలో చల్లా సూర్యచంద్రం, ముద్రగడ సురేష్, నలమాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థులకు యూనిఫాం అందజేత



యూనిఫాంలతో యర్నగూడెం జూనియర్ కాలేజీ విద్యార్థులు

దేవరపల్లి, ఆగస్టు 7: యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు 32మందికి స్థానిక పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం రూ.20వే లు, పార్డ్ ఇండియా సంస్థ రూ.17వేలు ఆర్థిక సాయంతో విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అంద జేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త కాశీవిశ్వనాథం, పార్డ్ఇండియా సభ్యులు అచ్యుతరావు, ఎస్.వెంకట్రావు, టీడీపీ నాయకులు బొల్లిన విజయ భాస్కర్, బీజేపీ నాయకులు మండా జనార్థనరావు, జనసేన నాయకులు పుట్టా శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చత్రపతి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.


ఆపదలో ఉన్నవారిని జనసేన ఆదుకుంటుంది

దేవరపల్లి, ఆగస్టు 7: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జనసేన ఎప్పుడూ ముందుంటుందని గోపాలపురం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సువర్ణరాజు అన్నారు. గోపాలపురం మండలం యర్నగూడెంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన అడబాక రాము, రామలక్ష్మి ఇళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో ఇంట్లోని బట్టలు, నిత్యావసరాలు, నగదు దగ్ధం కావడంతో బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అంద జేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బళ్ళా రాము, నూతల కరుణాకర్, జయలక్ష్మి, సూరిబాబు, స్వామి అయ్యప్ప పాల్గొన్నారు.

నేడు పొగాకు బోర్డు చైర్మన్ రాక

దేవరపల్లి, ఆగస్టు 7: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం మధ్యాహ్నం 12గంటలకు పొగాకుబోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ వస్తున్నారని దేవరపల్లి పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ బుధవారం విలేఖర్లకు తెలిపారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఉన్న పొగాకు పండించే రైతులంతా పొగాకుబోర్డు వద్దకు రావాలని చైర్మన్‌తో రైతుల సమస్యలను తెలిపే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

వేడుకగా శ్రావణమాస మహోత్సవాలు



శ్రీధనలక్ష్మి అమ్మవారు

చాగల్లు, ఆగస్టు 7 : స్థానిక వీవీఎస్ షుగర్స్ సమీపంలోని శ్రీధనలక్ష్మి అమ్మవారి శ్రావణమాస మహోత్సవాలు శుక్రవారం నుంచి వేడుకగా జరుగనున్నాయి. మొదటి శుక్రవారం ఉదయం 9.45 నిమిషాలకు 108 కలశాలతో పం చామృతాలు, సుగంధ ద్రవ్యాలతో పంచగంగ తీర్థాలతో కలశ అభిషేకములు, వసంతోత్సవం, పుష్పార్చన పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రెండవ శుక్రవారం 16న వరలక్ష్మి వ్రతం ప్రతిరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ కేజీ గుప్తా తెలిపారు. శ్రీధనలక్ష్మి అమ్మవారి ఆలయకమిటీ ఆధ్వర్యంలో జరిగే పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

టైర్ మారుస్తుండగా ప్రమాదం.. డ్రైవర్ మృతి

రాజానగరం, ఆగస్టు 7 : జాతీయ రహదారిపై దివాన్‌చెరువు గామన్ బ్రిడ్జ్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీ ఢీకొని ఐషర్ వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన ఈడే శివశంకర్ (39) ఐషర్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం నుంచి విజయవాడకు వెళుతుండగా మార్గమధ్యలో గామన్ బ్రిడ్జ్ వద్దకు చేరుకునే సరికి వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో పక్కకు పెట్టి టైరు మార్చుకుంటున్నాడు. ఈ సమయంలో ఇదే మార్గంలో విశాఖ నుంచి బాపట్లకు ఎయిర్‌ఫోర్స్ క్యాంటీన్‌కు కిరాణా వస్తువుల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి శివశంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ షేక్ బడే స్వల్పగాయాలతో బయట పడ్డాడు. రాజానగరం ఎస్ఐ మనోహర్ సంఘటనా స్థలానికి చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సినిమా చెట్టును బతికిస్తాం..

- సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తాం
- కుమారదేవంలో నేలవాలిన చెట్టు పరిశీలించిన కలెక్టర్



కుమారదేవంలో పడిపోయిన సినిమా చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఆగస్టు 7: సినిమా చెట్టు చిగురించే విధంగా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున నెలకొరిగిన సినిమా చెట్టును బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఫారెస్టు అధికారులు, రోటరీక్లబ్ సభ్యులు పరిశీలించారు. 150 సంవత్సరాల వయస్సున్న నిద్రగన్నేరు చెట్టు దెబ్బతిని రెండుగా చీలి నెలకొరిగింది. రోటరీక్లబ్ సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పడిపోయిన చెట్టును బ్రతికించే ప్రయత్నం చేస్తున్నారు. గోదావరితీరంలో జరిగే సినిమా షూటింగ్‌లలో ఎక్కువగా ఈ ప్రాంతంలో జరగడంతో ఈ చెట్టుకు సినిమా చెట్టుగా గుర్తింపు వచ్చిందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లా టూరిజం కౌన్సిల్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు మాట్లాడుతూ కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున నెలకొరిగిన చెట్టు ఏపుగా, గుబురుగా పెరిగే వృక్షం అన్నారు. ఎండిపోయిన బలమైన కొమ్మలు తొలగించకపోతే కాలక్రమేణ చెట్టు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, గ్రామస్తుల మనోభావాలను కాపాడుతూ అదే చెట్టును సాంకేతికంగా బ్రతికించుకోవడానికి ప్రవాసాంధ్రులు సైతం ముందుకు వస్తున్నారన్నారు. రోటరీక్లబ్ సభ్యులు ముందుకు వచ్చారు. గతంలో 150 సంవత్సరాల చెట్టును ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. నేను కూడా చూశాను అదే పద్ధతిని ఉపయోగించి ఈ చెట్టును బ్రతికించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంలో పారెస్టు డిపార్టుమెంటు నుంచి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ఈ చెట్టును పునర్నించడానికి ఖచ్చితంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అజయ్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గన్నమని రాజు, గ్రామస్థులు ఉన్నారు.

నేతన్నలను ప్రోత్సహించాలి

- బీజేపీ మహిళామోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిషోర్



చేనేత దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ మహిళామోర్చ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 7: నేతన్నలను ప్రోత్సహించా ల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ మహిళామోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిషోర్ అన్నారు. కొవ్వూరు సంస్కృత కళాశాలలో బుధవారం బీజేపీ మహిళామోర్చ రాష్ట్ర కార్యదర్శి తాడిమళ్ళ విజయవాణి ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు చేనేత వస్త్రాలు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. నిర్మల కిషోర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహించాలన్నారు. నేత వస్త్రాలు ధరించడం ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం కళాశాలలో కాతేరు చేనేత సొసైటీ ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు మాలతీరాణి, జిల్లా అధ్యక్షురాలు రజనీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హారిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేనేత దినోత్సవం

భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రాముఖ్యం ఉందని కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కలాశాల ప్రిన్సిపాల్ జె. సునీత అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించడం వలన చేనేత పరిశ్రమ అభివృద్ధి చెంది నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచనా, వీడియో తయారీ, పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించా రు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిసుందర్, రత్నవినీల, పుష్పాంజలి, లక్ష్మీకుమారి, లక్ష్మీగాయిత్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతి



బాదంపూడి రవికుమార్(ఫైల్)

నల్లజర్ల, ఆగస్టు 7 : మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన బాదంపూడి రవికుమార్(34)విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ మోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాదంపూడి రవికుమార్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. భార్య శిరీష ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాను నివసిస్తున్న పెంకుటిల్లు మంగళవారం కురిసిన వర్షానికి ఇంటిపై కప్పు పడిపోయింది. దీంతో భార్య పిల్లలతో మంగళవారం రాత్రి బంధువుల ఇంటివద్ద తలదాచుకున్నారు. కూలిపోయిన ఇంట్లో నిత్యావసర సరుకులు, గ్యాస్‌పొయ్యి ఇతర సామగ్రి తెచ్చుకునే క్రమంలో బుధవారం మధ్యాహ్నం వెళ్లి నిత్యావసర సరుకులు తీస్తున్న క్రమంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరుపై కాలు వేయడంతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య పిల్లలు కుటుంబానికి అండను కోల్పోయారు. భార్య రోదన చూపరులను కలిచి వేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

న్యాయం కావాలి!

- భార్య, కుమారుడిని వీధి పాలు చేసిన భర్త
- కోర్టు తీర్పును పట్టించుకోని వైనం
- అత్తింటి వద్దే కుమారుడితో సహా వివాహిత దీక్ష
- అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



దీక్ష చేస్తున్న రేష్మాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేట్ నక్కా చిట్టిబాబు

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 7: న్యాయంచేయాలని ఒక వివాహిత తన కుమారు డితో వర్షంతో అత్తింటి గేటువద్ద బుధవారం దీక్షకు దిగింది. దీంతో ఆమె భర్త అత్తమామలు ఆ ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. సుమారు 2 గంటల పాటు వర్షంలోనే కూర్చుని దీక్ష చేసింది. బాధితురాలు కథనం ప్రకారం రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన రేష్మాకు రాజేంద్రనగర్ వడ్డీల వీధికి చెందిన హబీద్ బాషాతో 2012 అక్టోబరు 21న వివాహం జరిగింది. పెళ్లయిన పది రోజులకే అదనపు కట్నం కోసం వేధింపులు ఆరంభమయ్యాయని వాపోయింది. 2013లో తనకు బాబు పుట్టాడని తెలిపింది. ఆ తరువాత ఇల్లు కట్టుకుందామని చెప్పి తన బంగారం మొత్తం తీసుకుని పుట్టింటి వద్ద వదిలేశాడని కన్నీటిపర్యంతమైంది. ఆ తరువాత ఎన్నిసార్లు ఇంటికి వచ్చినా బయటకు గెంటేశాడని వాపోయింది. దీంతో 2016లో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. తనను, తన కుమారుడిని చూసుకోవాలని కోర్టులో కేసు వేయగా 2023లో మాకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తనను, తన కుమారుడిని తన భర్త చూసుకోవాలని, నెలకు రూ.16 వేలు ఇచ్చి ఇంట్లో పెట్టుకోవాలని లేదా ఇల్లు అద్దెకు తీసి పెట్టాల ని కోర్టు చెప్పినా పట్టించుకోకుండా వదిలేశాడని కన్నీరు పెట్టుకుంది. తన తండ్రి కువైట్‌లో పనిచేస్తూ 2021లో కొవిడ్‌తో మరణించారని తనకు ఏ దిక్కులేదన్నారు. తన కుమారుడిని పెంచుకుని జీవించడం చాలా కష్టంగా ఉందన్నారు. తన భర్త హబీద్ బాషాకు తండ్రి, తల్లి, ఆడబడుచు వేరొక పెళ్లి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పింది. అమ్మాయిలతో గోవాలో తిరుగుతున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఫొటోలు మీడియాకు అందజేసింది. తనను ఏలుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే దారి కనిపించడం లేదని కన్నీరు పెట్టుకుంది. స్థానిక మహిళలు ఆమెకు అండగా నిలిచారు. బాధితురాలికి న్యాయంచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. మాజీ కార్పొరేటర్ నక్కా చిట్టిబాబును ఆమె వద్దకు పంపి బాధితురాలితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. మీకు న్యాయం చేస్తామని దీక్ష విరమించాలని సూచించారు. న్యాయం జరిగే వరకు అత్తింటి వరండాలోనే తాను ఉంటానని చెప్పడంతో ఆ మేరకు రేష్మా భర్త, అత్త, మామలను వారి ఇంటికే పిలిపించి సమస్యను ఎమ్మెల్యే వద్ద పెట్టి న్యాయం చేస్తామని నక్కా చిట్టిబాబు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవి

- ఐసీడీఎస్ పీవో పద్మావతి
- తల్లిపాల వారోత్సవాలు



కొవ్వూరు : వేములూరులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్వాడీలు

దేవరపల్లి, ఆగస్టు 7: దేవరపల్లి మండలం త్యాజంపూడిలో అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీవో పద్మావతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని ప్రతీ బిడ్డకు గంటలోపు ముర్రిపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'పుట్టిన అరగంటలో బిడ్డకు తల్లిపాలు పట్టించాలి'

కొవ్వూరు: పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలని, తద్వారా బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ. ఆదిలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లి వారోత్సవాలలో భాగంగా కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, ఏఎన్ఎం రాజ్యలత, విజయలక్ష్మిలు మాట్లాడుతూ తల్లి పాలు పట్టించడం వలన కలుగు ఉపయోగాలను తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన అరగంటలో తల్లి పాలు పట్టించాలన్నారు. డబ్బా పాల వలన ఆరోగ్యానికి హానికరమన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. ఆ పాలలో కొలెస్ట్రామ్ అనే పదార్థం ఉంటుందని, దానివలన బి డ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, ఆశాలు, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పెరవలి: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి, పెరవలి, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కొత్తపల్లి సర్పంచ్ బండారు వెంకటరమణ మాట్లాడుతూ తల్లిపాలు చాలా బలవర్ధకమైనవని వీటిని పట్టించడంవల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, వెంకట నరసమ్మ, విజయలక్ష్మి, రాణి, సుశీల పాల్గొన్నారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లక్ష్మి, గ్రామ నాయకులు బొడ్డు రామాంజనేయులు, మానికిరెడ్డి మురళీకృష్ణ, మావుళ్ళ పిప్ప ర రవి, రాంబాబు పాల్గొన్నారు.

నల్లజర్ల : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని పోతినీడుపాలెం గ్రామంలో ఐసీడీయస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తన సిబ్బందితో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. సర్పంచ్ పిచ్చుకల గణపతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపర్రులో గర్భిణులకు సీమంతాలు



తాడిపర్రులో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని చెప్పారు. గర్భిణులకు సీమంతాలు చేసి, చీరలు పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. వేలివెన్నులో పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ సృజన ఆధ్వర్యంలో తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.భాగ్యలక్ష్మి, సరోజిని కూటమి నాయకులు వాకలపూడి సత్యనారాయణ, అక్కిన సుధీర్ డి. ప్రసాదు, అక్కిన గోపాలకృష్ణ, హెల్త్‌సూపర్‌వైజర్ కె. సుభాషిణి, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరంలో బుధవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి తల్లులకు, గర్భిణులకు తల్లిపాలుపై అవగాహన కల్పించారు. గ్రామంలోని అంగన్‌వాడీ , వైద్యసిబ్బంది తదితరులు పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు.

మంత్రిగారు చెప్పినా..పట్టదా!

- తీపర్రు అప్రోచ్ రోడ్డుకు మోక్షమెప్పుడో
- మంత్రి ఫోన్‌చేసి చెప్పినా అధికారుల్లో చలనం లేదు





10 రోజుల క్రితం అధికారులకు ఆదేశాలిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, ఆగస్టు7 : అధికారుల్లో ఇంకా గత ప్రభుత్వంలో అలసత్వం పోలే దు. సాక్షాత్తూ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్‌చేసి చెప్పినా వారిలో చలనం లేదు. నిడదవోలు-నరసాపురం కాలువపై తీపర్రు నుంచి తాటిపర్రు వెళ్లే ఆర్‌అండ్‌బీ వంతెన అప్రోచ్ రోడ్డు దిగబడిపోయి నెలరోజులు కావస్తోంది. పది రోజుల క్రితం రాష్ట్ర మంత్రి దుర్గేష్ దృష్టికి గ్రామస్థులు ఈ సమస్య తీసుకెళ్లడంతో ఆయన ఈ మార్గంలో వెలుతూ పరిస్థితి చూసి అప్పటికపుడు ఆర్‌అండ్ బీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ప్రతీనిత్యం స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్ల ప్రయాణిస్తుంటాయని రాత్రి సమయంలో అనుకోని ప్రమాదం జరిగితే కాలువలోకి తిరగబడి ప్రాణనష్టం సంభవించే పరిస్థితి ఉందని తెలిపారు.తాత్కాలికంగా అయినా ఇక్కడ చర్యలు తీసుకొని రాబో యే వేసవిలో శాశ్వత పరిష్కారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్నిరోజులు గడుస్తున్నా ఇక్కడ మాత్రం పరిస్థితి అలాగే ఉంది. ఏదైనా బస్సు అదుపుతప్పితే కాలువలోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఎప్పుడు ఏమవుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కొవ్వూరురూరల్ ఎస్ఐగా శ్రీహరిరావు బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు, ఆగస్టు 7:కొవ్వూరురూరల్ ఎస్ఐగా కె.శ్రీహరిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరపల్లి ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై కొవ్వూరురూరల్ ఎస్ఐగా వచ్చారు. కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడడంలోను, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కె.సుధాకర్ కాకినాడ జిల్లా తిమ్మాపురం ఎస్‌గా బదిలీ అయ్యారు.

తాళ్ళపూడి ఎస్ఐగా రామకృష్ణ



తాళ్ళపూడి, ఆగస్టు 7 : తాళ్లపూడి ఎస్ఐగా తోట రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ముందు సీతానగరం రాగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సీతానగరం నుంచి తాళ్ళపూడి మండలానికి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యువతను పెడత్రోవ పెట్టించే మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎంఈవో శ్రీనివాసరావు

గోపాలపురం, ఆగస్టు7: విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ ఎస్ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 9హైస్కూల్ రెండు గురుకుల పాఠశాలలు, నాలుగు యూపీ పాఠశాలలు 38 ప్రైమరీ పాఠశాలలు కలిపి మొత్తం 52 పాఠశాలలకు చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహించాల్సి ఉంది.

రెండు కార్లు ఢీ

- నలుగురికి స్వల్పగాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

గోపాలపురం, ఆగస్టు7: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో రెండు వాహనాల ముందుభాగం నుజ్జునుజ్జైంది. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొయ్యల గూడెంవైపు నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తున్న కారును బుధవా రం ఢీకొట్టింది. దీంతో నలుగురికి స్వల్పగాయాలు కాగా వారిని స్థానికులు 108 వాహనంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని వ్యాపారులపై కేసులు



కొవ్వూరు టోల్‌గేట్ సెంటర్‌లో పెట్రోల్‌బంకులో తనిఖీలు చేస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, లీగల్ మెట్రాలజీ అధికారులు

కొవ్వూరు, ఆగస్టు 7: ప్రభుత్వ నిబందనలు పాటించని 4గురు రైస్ వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు ఏలూరు లీగల్ మెట్రాలజి అసిస్టెంట్ కంట్రోలర్ బి.సాయిరాం తెలిపారు. సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో బుధవారం లీగల్ మెట్రాలజి అధికారులు కొవ్వూరు పట్టణంలో పెట్రోల్‌బంకులు, రైస్‌షాపులు, చికెన్ షాపులలో తనిఖీలు చేపట్టారు. సాయిరాం మాట్లాడుతూ కొవ్వూరు టోలిగేట్ సెంటర్‌లోని పెట్రోల్‌బంకులో సబ్ కలెక్టర్ ఆశుతోష్‌శ్రీవాస్తవ ఆధ్వర్యంలో కొలతలు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన స్పెషల్ బియ్యం, కందిపప్పు కౌంటర్లలో ఖచ్చితమైన తూకంతో వస్తువులను అందించాలన్నారు. ధరల పట్టికలు ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటుచేయాలన్నారు. కస్టమర్ కేర్ నిభందనలు పాటించని బియ్యం వ్యాపారులపై 4 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కొవ్వూరు పట్టణంలో 2, నిడదవోలు పట్టణంలో 2 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ వెంట కొవ్వూరు లీగల్ మెట్రాలజి ఇన్స్‌స్పెక్టర్ జీ.వి. ప్రసాద్, సివిల్ సప్లయిస్ డి.టి ఎం. సునీత సిబ్బంది పాల్గొన్నారు.